## 73. అసలైన బలం

తన కుటుంబ సభ్యులతో పిక్నిక్‌కి వెళ్ళిన ఓ తొమ్మిదేళ్ళ కుర్రాడు అక్కడున్న చిన్న చిన్న కొండ రాళ్ళని ఓ చోట కుప్పగా పోయసాగాడు. ఓ పెద్ద రాయిని ఎత్తడం అతనికి సాధ్యం కాలేదు. దాని చుట్టూ తన చేతి వేళ్ళని బిగించి, ఊపిరిని బిగబట్టి దాన్ని పైకి లేపడానికి విశ్వప్రయత్నం చేసి విఫలమయ్యాడు.

అది గమనించిన అతని తండ్రి ఆ కుర్రాడి దగ్గరకి వెళ్ళి చెప్పాడు.

"నీకున్న బలమంతా వుపయోగిస్తే దాన్ని ఇట్టే ఎత్తగలవు కదా? మరి వుపయోగించవే?"

"ఉపయోగించాను నాన్నా. నా బలమంతా ఉపయోగించినా దీన్ని లేపలేక పోయాను." చెప్పాడు వాడు.

"నా మాట నీకర్థం కాలేదు. నేను నీకున్న బలం కాదా?" అని నవ్వి ఆయన ఆ రాతిని లేపి రాళ్ళకుప్ప మీదకి విసిరేసాడు.

మన జీవితాల్లో కూడా ఇలాగే మనం మోయలేని బరువులని మోయాలని ప్రయత్నిస్తుంటాం కాని దైవ బలం కోసం మనం ప్రార్థించం. దైవ బలమే నిజమైన బలం.

## 74. దేవుడి కన్నా గొప్పవాడు

ఓ రాజు తన రాజ్యాన్ని బాగా విస్తరించాక, తనని మించిన వాడు లేడన్న అహంకారంతో విర్రవీగసాగాడు. అది ఆ రాజు నడకలో, మాటల్లో, ప్రతీ చర్యలో వ్యక్తం అయేది. ఇది చూసి చాలామంది మనసులోనే ఆయన్ని అసహ్యించుకోసాగారు.

ఓ రోజు రాజు సభలోని ఓ మహా పండితుడ్ని చూసి అడిగాడు.

"నేను గొప్ప వాడినా? లేక ఆ దేవుడా? సరైన జవాబు చెప్పండి."